సూరీడు డ్యూటీ ఎక్కడానికి ఇంకా చాలా ఆలస్యం ఉంది. అందుకే పక్షుల కిల కిలారావాలు వినిపించడం లేదు. అవి తమ నెలవుల్లో నిద్రోతున్నాయి. ఇంకొంత సేపు అయితే గాని ఆ పల్లెలో లయబద్ధంగా వినబడే రోకటి పోటు, కవ్వపు సవ్వడి చెవినబడవు. ఊరివెలుపలనే ఏ ఖర్చు లేకుండా దొరికే నాపరాళ్లు తెచ్చి దశాబ్దాల క్రిందట ఎప్పుడో వీధిలో పరిచిన నాపరాళ్ల బండలు కొన్ని పగిలిపోయి ఉన్నాయి. కొన్ని లేచిపోయి మట్టి తేలింది. అదే ఆ ఊరి

# ఊరువిడిచిన 'సిరి'

**పులుసు గోపిరెడ్డి**

రాచబాట. వీధిలో జన సంచారం లేదు. అమావాస్య రోజులు. ఆ నిశీధిలో ఒకే ఒక మానవాకారం ఆ వీధిన కదులుతూ కన్పడ్డది. ఆరు దశాబ్దాలకుపైగా ఆ వీధి మెరకపల్లాలకు అలవాటు పడిన నడక అది. నిదానంగా ఊరుదాటి కాలిబాట పట్టింది లక్ష్మమ్మ ఉరఫ్ లచ్చమ్మ.

ఎప్పటిలాగే ఆ రోజూ తెల్లవారింది.

ఇంట్లో అందరికంటె ముందు లేచే లచ్చమ్మ జాడ కనపడలేదు. 'చెంబట్టుకు పోయిందేమో' అనుకొన్నారు కాసేపు ఎంత సేపటికి రాలేదు.

'చీకట్లో అరిజెంటుగా ఉరుకుతూ వచ్చి ఎవురైనా కాముప చెయ్యటానికి తీసకపోయి(న్రేమో' అనుకొన్నారు కాసేపు.

ఎక్కడికి పోయిందో!

ఊరిజనం ఒక్కొక్కరే వచ్చి 'అన్నాలుతినే ఏళకైనా రాలేదు. ఏడికైనా ఊరికి పొయ్యిందేమో'

'వాళ్లబ్బయ్య కాడికి బస్తీకి పోయి ఉంటే ఇంట్లో చెప్పి పొయ్యేదేనే? ఏమై పోయిందబ్బా'

ఇలా ఒక్కొక్కరు వారికి తోచిన అభిప్రాయం వారు వెల్లడిస్తున్నారు.

లచ్చమ్మ కూతురు తిరమలమ్మ మొఖం చూస్తే అంతులేని అవేదనతో కుమిలిపోతున్నట్లు కన్పించింది.

000

ఒకసారి లచ్చమ్మ మాచెర్ల తిరుణాల చూడ్డానికి పోయింది. ఆ చుట్టు పక్క గ్రామాల నుండి వేలాది మంది ఆ తిరుణాలకు వచ్చి చెన్నకేశవస్వామిని దర్శించుకొంటారు. బ్రహ్మనాయుడి కాలంలో ఓ వెలుగు వెలిగిన చెన్నకేశవుడు కాలంతరంలో కాస్త మసకబారిన మాట నిజమేగాని ఇప్పటికీ తిరునాళ్ళ రోజుల్లో మాత్రం ఆయన గుడి దేదీప్యమానంగా వెలుగుతుంటుంది జనసందోహంతో.

చుట్టాల [illegible] తిరునాళ్ళ చూడటానికి వెళ్లింది లచ్చమ్మ. తిరునాళ్ళ సందడి చెప్పేదేముంది? రంగుల రాట్నాలు, మిఠాయి దుకాణాలు ([illegible] ప్రత్యేక ఆకర్షణ), అలంకరణ వస్తువులు, ఆట బొమ్మలు, దేవుళ్ళ పటాలు, పాత్ర సామానుల దుకాణాలు, అమాయకులను మోసం చేసే తాడాట, పేక ముక్కలు ఆట వంటి జూదాలు, రెండు రూపాయలకే మీ ఫోటో



అంటూ అప్పటికప్పుడు వెలిసే వీధి స్టూడియోలు ఒకటేమిటి... పల్లె ప్రజలను సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తేవి అనేకం. లచ్చుమ్మకు ఈ ఫోటోల గోల పట్టదు. కానీ దగ్గరి చుట్టం ఎవరో 'ఏందక్క, నీ పుటువుంటే ఎప్పుడైనా మేం చూస్కుంటం, దిగు' అంటూ గుంజుకుపోయి తీయించాడు 'ఫుటువ'. ఫోటోలు తీసిన వాడు సాయంకాలం వచ్చి మీ ఫుటువలు తీసకపోండి అని అందరికీ చెప్పి పంపించేశాడు.

అందరూ చెన్నకేశవుని దర్శించుకోడానికి ఉరుకులు పరుగులమీద పోతున్నారు. ఒకరినొకరు తోసుకుంటూ అంతలో తాటి చెట్టు పై నుండి మిగుల పండిన తాటి పండు నేలపై పడినపుడయ్యే శబ్దం ఒకటి వినపడ్డది ఆ గుంపు మధ్యలో. ఆ శబ్దం వినబడ్డదే ఆలశ్యం లచ్చుమ్మ అటువైపు నడిచింది.

యాత్రికులలో ఒకడు మూర్ఛ వ్యాధితో పళ్లు బిగపట్టి కాళ్లు, చేతులు కొట్టుకుంటూ నేలమీద పడి ఉన్నాడు.

'అరె! అట్ట చూత్తరేందిరా, తాళం చెయ్యి ఇయ్యండి. వాడి నోట్లో పెట్టాలి. లేకుంటే వాడు నాలిక్కొరుకుంటండు' అంటూనే ప్రక్కవాళ్లందించిన తాళం చెవి తీసుకుని వాడి రెండు పళ్ల వరుసల మధ్యలో పెట్టింది.

ఎంత సేపటికీ అక్కడి నుండి ఆమె కదలక పోవడం చూచి 'లచ్చక్క సంగతే అంత. ఇప్పుడప్పుడే తెలివి రాదు. మీరైతే రండి పోదాం' అన్నారు ఒకరు.

'అక్కా, అంత పోతమంటున్నారు. ఆ పిల్లగాడి సంగతి వాళ్లోల్లు చూసు కుంటారు. మన్మంతే లేచిరా' అన్నాడు చుట్టపాయన ఒకడు.

"లచ్చమ్మకు చటుక్కున ఓ ఆలోచన వచ్చింది. తన ఊరిజనం ఏ రోగం వచ్చినా సరియైన వైద్యుడు లేక నానా ఇబ్బందులు గురి అవుతున్నారు. పోలయ్య తాత ఆ పిల్లదాన్ని రక్షించిన వైనం మనస్సులో బాగా నాటుకొంది. ఏమైనా సరే ఆ వైద్యం నేర్చుకొని తన ఊరికి సేవ చేయాలన్న పట్టుదల పెరిగింది."

ఈ పిల్లాడు స్పృహ లేకుండా పడుండడు. వాళ్ల చుట్టపోళ్లు ఉన్నట్టు లేదు. మీరుపోండి. మనం ఈడ ఉండెటోళ్లమే. దేవుడేడికి పోతడు, రేపైన చూత్త. ఈ పిల్లాడు లేచేనంకనే వత్త. మీరైతే పోండి' అని వాళ్లను పొమ్మంపింది.

లచ్చమ్మకు అక్షర జ్ఞానం లేనిమాట నిజమేగానీ, భగవంతుడు అనుగ్రహించిన లోకజ్ఞానం బాగానే ఉంది.

పుస్తక జ్ఞానమైనా లోక జ్ఞానమైనా తోటివారికి ప్రేమానురాగాలు పంచిపెట్టే సాయపడ లేనప్పుడు నిరర్ధకమే అవుతాయి. అందుకే ఓ సినిమా కవి 'చదువు రాని వాడవని దిగులు చెందకు మనిషి మదిలోన మమత లేని చదువు లెందుకు అంటాడు ఓ పాటలో. ఆ పాట విన్నప్పుడు ఎవరికైనా ఆ కవి జీవిత సారాన్ని ఎంత చక్కగా రంగరించి పోశాడా అనిపిస్తుంది.

ఈ దేహం నీటి బుడగ వంటిది. దేహం అనే ఈ మట్టి ఏనాటికైనా మట్టిలో కలిసిపోయేదే. మిగిలేది మనం చేసిన మంచి ఒకటే అనేది గుర్తెరిగి జీవించిన మనిషి లచ్చమ్మ.

ఆ పిల్లవాడు స్పృహలోకి వచ్చేంత వరకూ శైత్యోపచారాలు చేసి స్పృహ రాగానే కాసిని మంచినీళ్లు తాగించి, సేదతీర్చి పరుగు పరుగున గుడికాడికి చేరింది. దర్శనం అయ్యాక చుట్టాలందరితోపాటు వచ్చి ఫోటోలు తీసినవాడి దగ్గర తన ఫోటో కాపీ తీసుకుని 'రౌండి' లో పెట్టుకుని ఊరిబాట పట్టింది.

మిట్టపాలెం చిన్నపల్లెటూరు. ఆ ఊరందరి దాహం తీర్చేది ఒకే ఒక బావి. ఊరిలో ఆ పాముల కుటుంబాలు నాల్గు వీధులకు పరిమితం. ఊరికి ఆ చివర వేరువేరుగా మాలపల్లి, మాదిగ గూడెం ఉన్నాయి.

రెండుమైళ్లు నడిచి పోతేగాని ఇంజక్షన్ చేయగల వైద్యుడు దొరకడు. ఆస్పత్రికే పోవాలంటే ఆమడ (8 మైళ్లు) దూరంలో ఉన్న గురజాలకు పోవలసిందే. అది తాలుకా కేంద్రమేగాని బహు చిన్న పట్టణం. అంత దూరం పోయి వైద్యం చేయించుకోగల స్తోమత గల వాళ్లు కూడా ఆ ఊరిలో బహు కొద్దిమందే. గొడ్లకు రోగం వచ్చినా, మనుషులకు రోగం వచ్చినా ఊరిలో గల ఇద్దరు నాటు వైద్యులే శరణ్యం. ఆ ఇద్దరు పొట్ట గొడవడానికి వైదం చేస్తారు. లచ్చుమ్మకూడా చెట్టు మందు, చిట్కావైద్యం చేస్తుంది కాని దబ్బు పుచ్చుకోదు. ఎవరికైనా ప్రాణం మీదికొస్తే ఆమె మంత్రసాని పని కూడా చేస్తుంది.

000

లచ్చుమ్మ ఊరిలోకి అడుగుపెడుతుండగానే మల్లయ్య పరుగు పరుగు ఎదురొచ్చాడు.

'లచ్చక్కా మా పెద్ద బర్రె నిన్నటాల్నుంచి గడ్డి ముట్టడంలేదు, కుడితి తాగడం లేదు. బర్రె కళ్లు మూసుకుకోని అట్టనే పడి ఉంది. మాకు బయమయితున్నది. నీ కోసం ఇంటికి పోయడిగితే మాచర్ల తిర్నాలకు పోయినావని చెప్పిను. మాకున్న బర్రెగొడ్లలో పాలిచ్చేది ఇదే. పిలగాండ్ల పేణాలన్ని దీనిమీదనే. ఎట్టయిన బర్రెను బతికించక్కా' అంటూ బ్రతిమాలు కొన్నాడు.

పోయి చూద్దాంపా గాలికుంటు సోకితే కష్టం గాని మామూలు రోగమయితే పరవలేదు. అసలు దాని కొచ్చిన కష్టమేందో చూద్దాం' అంటూ మల్లయ్య వెంట నడిచింది.

బర్రెను చూస్తూనే 'అరె ఇది కడుపులో నొప్పితో బాదపడుతున్నట్టుందిరా. ఏం మేతమేసిందో! కోమటి రామయ్య దుకాణానికి పోయి అర్ధరూపాయిచ్చి వాము, ఇంగువ, పిప్పళ్లు పట్టకరా బర్రెకు కడుపు నొప్పి అని లచ్చమ్మ పంపించిందని చెప్పు. కోమటాయనే పొట్లం కట్టిస్తడు దినుసులు అని పురమాయించింది.

ఆ దినుసులన్నీదంచి వెచ్చటి నీళ్లలో కలిపి వెదురు గొట్టంలో పోసి బర్రె నోట్లో పెట్టి ద్రావకం త్రాపించింది.

'రెండు సార్లు పారుద్ది. పారుడు కట్టుకొంగనె మేత కొర్కది. రేపు మాపిటాలికి పాలు పిండుకోవచ్చు. భయంమేం లేదు' అని భరోసా చెప్పి కదిలి పోయింది.

పశువుకు వైద్యం చేస్తున్నంత సేపు రౌండిలో ఉంది ఫోటో. భర్త బ్రతికున్న రోజుల్లో ఇద్దరూ కలిసి బస్తీలో ఓ ఫోటో దిగారు. ఆ ఫోటో ఫ్రేము వెనక దీనిని దూర్చి భద్రపరిచింది.

లచ్చుమ్మ వైద్యం నేర్చుకోవడం కాకతాళీయంగా జరిగింది. ఒకసారి చెల్లెల్ని చూడటానికి వెల్దుర్తికి పోయింది. లచ్చుమ్మ చెల్లెల్ని వెల్దుర్తి ఇచ్చారు. అదికూడా పల్లెటూరే. కాని అప్పట్లో ఆ ఊరిలో ఓ కట్టుబాటు ఉండేది. పెద్దల మాట సద్ది మూట అన్న నమ్మకం జనానికి ఉండేది. ఊరిజనం ఇంగిత జ్ఞానం కలవారు. ఆ రోజుల్లోనే ఒక యల్.ఐ.యం డాక్టర్ను పిలిపించుకొని చిన్న ఆస్పత్రిని కూడ నెలకొల్పుకొన్నారు. మాచర్ల, ఆ చుట్టు పక్కల గ్రామాలనుండి కూడా రోగ పీడితులు వచ్చి ఈ డాక్టరు హస్తవాసి మంచిదని వైద్యం చేయించుకొంటుండేవారు. ఈ డాక్టరు కాక ఊరిలో గొప్పగా ఆయుర్వేద వైద్యం తెలిసిన పోలయ్య అనే వైద్యుడు కూడా ఉండేవాడు.

రెండు మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న చెల్లెలు కూతురు కళ్లు తేలేసింది. ఒళ్లంతా చల్లబడుతోంది. లచ్చుమ్మ స్పృహలేని ఆ పిల్లను చంకనేసుకొని చెల్లెలు వెంట రాగా పోలయమ్మ దగ్గరకు తీసుకెళ్లింది. ఆయన వెంటనే ఏదో ఒక గుళిక రంగ రించి గంధం తీసి ఆ పిల్ల కళ్లలో పెట్టాడు. కాసేపట్లో కళ్లు తెరిచింది.

మెల్లి మెల్లిగా ఒంటి వేడిపెరిగింది. పోలయ్య తాత పసరులా ఉన్న ద్రావకం ఆ పిల్లనోట్లో పోశాడు. పిల్ల లేచి కూర్చుంది. ఈ పొట్లాలు రెండు పూటల తేనెలో కలిపి నాకించండి. రేపొచ్చి చూపించి పొండి అని పంపించాడు.

లచ్చుమ్మకు చటుక్కున ఓ ఆలోచన వచ్చింది. తన ఊరిజనం ఏ రోగం వచ్చినా సరియైన వైద్యుడు లేక నానా ఇబ్బందులు గురి అవుతున్నారు. పోలయ్య తాత ఆ పిల్లదాన్ని రక్షించిన వైనం మనస్సులో బాగా నాటుకొంది. ఏమైనా సరే ఆ వైద్యం నేర్చుకొని తన ఊరికి సేవ చేయాలన్న పట్టుదల పెరిగింది. పోలయ్యను ప్రాధేయపడింది. తన ఊరి సంగతి వివరించింది. 'వైద్యోనారాయణోహరిః' అన్న సూక్తిని తగ్గట్టుగానే ఆ కాలం వైద్యుడు జీవించారు. పోలయ్యతాత లచ్చుమ్మకు 'నాటు వైద్యం' నేర్పించాడు.

ఆమెను స్వయంగా ఏటిగట్టు'కు వెంటబెట్టుకుపోయి అక్కడి వనమూలికలు సేకరించడం నేర్పాడు. వాటిని ఔషధాలుగా తయారుచేసుకోవే పద్ధతుల కూడా నేర్పించాడు.



వెల్లుర్తి ఊరిలోంచి ఓ మైలు దూరం దక్షిణానికి ఎర్రపొలాల లోంచి నడుచుకుంటూ పోతే 'ఏటిగట్టు' తగులుతుంది. ఇక ఆపైన అంతా దట్టమైన అడవి. అడవి జంతువులను వేటాడే వారు ఆ మార్గాన్నే అడవిలో ప్రవేశిస్తారు. వివిధరకాల పొదలు, నేరేడు, మారేడు, మర్రి, జువ్వి, రావి, ఏగిస, దేవదారు నానా విధాల వృక్షసంపద కనపడేది.

ఔషధాలు తయారు చేసుకొనేందుకు బాగా పనికి వచ్చే ఉత్తరేణి, పన్నెజముడు, దుండిగ, కలబంద, ఉమ్మెత్త, మొదలైన మొక్కలు పుష్కలంగా ఉండేవి.

లచ్చుమ్మ నెలకు, రెండు నెలలకో ఓసారి పనికల్పించుకొని ఆ ఊరికి పోయి తనకు కావలసిన ఔషధులు తెచ్చుకొనేది.

000

'లచ్చక్కా, మా పిల్లగాడికి తలనిండా పుళ్లు పడ్డయి. రాతిళ్లు దురదకు తట్టుకోలేక తల బరుక్కుంటే పక్కనిండా రకత్తం అయితున్నది. వాడి అవస్థ అంత ఇంతకాదు' అంటూ వస్తే.

మారేడు ఆకులు కోసుకొచ్చి కాల్చి పొడిచేసి ఆ పొడిలో మైలతత్తువ, పటిక కాల్చి తగు పాళ్లలో కలిపి కొబ్బరి నూనెతో పట్టిస్తే ఆ మంటకి పిల్లగాడు కాసేపు నటరాజు అవతారం దాల్చినా కొద్దిసేపటిలో ఆ మంట తగ్గి స్థిమిత పడేవాడు. నాల్గు పూటలు ఆ మందు పట్టిస్తే ఎంత లావు పుళ్లైనా ఎర్రపుండుగా పడి మానిపోయేవి.

'అక్కా, పిల్లది కాపరానికి పోయిన సంది తెల్లబట్టయితున్నది. దానిగోస చూడ లేకున్నం అంటూ తమ బాధ చెప్పుకొంటే ఇంట్లో బానలో నాన వేసి ఉంచిన నేరేడు, రావి బెరడు ఊట కొంత తీసి పటిక బెల్లం కలిపి పుచ్చుకోమని చికిత్స చేస్తే వారం, పదిరోజుల్లో వ్యాధి నయమయ్యేది.

ఆ రోజుల్లో ఎయిడ్స్ వ్యాధి ప్రజలకు తెలియదు. కాని సిఫ్లిస్, గనేరియావంటి సుఖవ్యాధులతో బాధపడే గాలి తిరుగుడు వెధవల ఉండనే ఉన్నారు.

'ముదరష్టపు సన్నాసి! ఆగాలి తిరుగుడు మానేసి ఇది పైపూతకు, ఇది లోపల మింగడానికి ఓ వారం రోజులు వాడు. ఇంకోసారి ఆ తిరుగుళ్లు తిరిగి రోగం అంటించుకొని వస్తివా చెప్పుతో కొడత' అని మందలించి మందు లిచ్చిపంపేది.

కామెర్లవ్యాధితో బాధపడే రోగులెవరైనా వస్తే వాళ్ల కళ్లు పరీక్షగా చూసి ఓ మట్టి చట్టితో మూత్రం పోయించి నాలుగు అన్నం మెతుకులు దానిలో వేసి రంగు పరీక్షించి వ్యాధి ఎంత ముదిరిందో గ్రహించి దానికి తగ్గట్టుగా నేల ఉసిరి రసంతో పసుపు మరి కొన్ని దినుసులు కలిపి మందు త్రాగించేది. నారతో ఓదండచేసి దానికి ఉత్తరేణి, తెల్లగంజేరు పసరుపూసి రోగి మెడలో వేసేది. దండ మెడలో ధరింప చేసేప్పుడు మాత్రం కొబ్బరికాయ, కాస్త బెల్లం ముక్క, సాంబ్రాణి తెప్పించేది. ప్రత్యక్ష దైవమైన సూర్య భగవానునికి నమస్కరించి ఆ దండకు సాంబ్రాణి పొగవేసి, కొబ్బరి కాయ కొట్టేది. బెల్లం ముక్క పొడిచేసి ఆ కొబ్బరి ముక్కలతో కలిపి ప్రసాదంగా అందరికీ పంచేది. రోగికయ్యే ఖర్చు ఆ కొబ్బరి కాయ, బెల్లం ముక్క. అంతే పథ్యం సంగతి మాత్రం నిక్కచ్చిగా చెప్పేది.

మధుమేహం (సుగర్ వ్యాధి) ప్రారంభ దశలో ఉంటే లచ్చుమ్మ ఇచ్చే మందు విచిత్రమైనదే! తెల్లపూల బిళ్ల గన్నేరు (గన్నేరు కాదు) పొద నుంచి వేరాకులు కోసి తెచ్చి, ఓ మిరియం గింజ కలిపి పరగడుపునే నమలమని చెప్పేది. 15 రోజులు అలా చేస్తే మధుమేహం మాయం.

రోగం నయమయ్యాక 'లచ్చమ్మ తల్లీ, నీ చేతి చలవన మా ఒంటికి నయమైంది. పేదోళ్లం. ఇంతకంటె ఇచ్చుకోలేం. ఈ పదిరూపాయలు మా తృప్తి కోసం ఉంచుకోతల్లీ అంటూ ఇవ్వ చూపితే

'మా గురువు పోలయ్య తాత డబ్బులు తీసుకుని వైదిగం చేస్తే అది పన్జేయదని చెప్పిండు. మీరంతా చల్లగుండాలి. ఊరంత చల్లగుండాలి. మీ దీవెనలుండ బట్టే ఈ ముసలి తనంలో ఇంత సాయం చేస్తున్న. ఎన్ని డబ్బులు పోసి కొనుక్కుంటే ఈ ఆరోగ్గెం వత్తది?' అంటూ కృతజ్ఞతలు చెప్పేది.

జలుబు, జ్వరం, పంటి నొప్పి... వ్యాధి ఏదైనా సరే ఆమె మందుల సంచిలో మందులు సిద్ధంగా ఉండేవి.

ఈ రోజుల్లో జలుబుచేసి డాక్టరు దగ్గరికి రెండు వందలు చేత పట్టుకు పోతే డాక్టరు ఫీజుకు మందులకు ఆ మొత్తం సరిపోదు.

'ఇంత మిరియాల కషాయం తాగించి పసుపు ఆవిరి పట్టించండిరా రెండుపూటల్లో తగ్గిపోద్ది' అని లచ్చుమ్మ ఇచ్చే సలహాకు కానీ ఖర్చులేదు.

కొందరు తమాషాగా అంటుంటారు 'జలుబుకు మందిస్తే వారం రోజుల్లో తగ్గుతుంది, మందివ్వకుంటే ఏడు రోజుల్లో తగ్గిపోతుంది' అని. కొన్ని రోగాలు శరీరం తనంత తానుగానే నయం చేసుకొంటుంది. ఆహార నియమం పాటించి కాస్త సమయం ఇవ్వాలి అంతే. ఈ వేళ చాలా అనర్థాలకు కారణం మారిన జీవనశైలి. అన్నం తినడానికి కూడా సమయం దొరకడం లేదని చెప్పేవారున్నారు!

సశేషం